ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
మహబూబ్‌నగర్
జిల్లా వార్తలు
గురువారం 12 డిసెంబరు 2024
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 29.0 | కనిష్ఠం : 18.0





విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన కలెక్టర్ విజయేందిరబోయి

జడ్చర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. జడ్చర్ల మండలం చిట్టబోయిన్‌పల్లి వద్ద ఉన్న సాంఘిక, సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగదిని పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించారు. కాగా మాడిపోయిన అన్నం వడ్డించడాన్ని గమనించి, పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఆమె, విద్యార్థినులకు అందించే ఆహారం అంశంలో అజాగ్రత్త, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనం గురించి, అలాగే పలు అంశాలపై విద్యార్థినులతో మాట్లాడారు.

ఇళ్లు ఇచ్చిన 42 ఏళ్లకు నోటీసులు

- ఒక్కొక్కరు రూ. 2.39 లక్షలు చెల్లించాలని జారీ చేసిన రాష్ట్ర హౌసింగ్ బోర్డు
- 1982లో హైర్ పర్చెస్ సిస్టమ్ కింద ఇళ్ల నిర్మాణం
- సంవత్సరానికి రూ.1832 చెల్లించాలంటూ బోర్డుకు మార్టిగేజ్
- పేదలు కావడంతో ఆ మొత్తం చెల్లించలేమని అప్పుడే విన్నపాలు
- నెలాఖరుకు చెల్లించకపోతే ఇళ్లు జప్తు చేస్తామంటున్న అధికారులు
- ఇందిరమ్మ సర్కారులో వాటిని మాఫీ చేయాలంటున్న లబ్ధిదారులు

ఇళ్లు ఇచ్చి ఇబ్బంది పెడితే ఎలా



తమను పేదలుగా గుర్తించి, అప్పట్లో ప్రభుత్వం తమకు స్థలం కేటాయించి ఇళ్లను నిర్మించి ఇచ్చింది. బీడీ పని, కూలి పని చేసుకుంటూ ఏళ్లగా ఆ ఇళ్లలో ఉండి జీవనం సాగిస్తున్నాం. కుటుంబం గడవడమే కష్టంగా ఉంటే అప్పుడు ఇచ్చిన ఇళ్లకు రూ. 2,32,429 చెల్లించాలంటే ఏం చేయాలి. మాకు ఇళ్లు ఇచ్చినప్పుడే మేము ఆ మొత్తం కట్టలేమని చెప్పాం. మేము ఇప్పుడు కూడా పేదరికంలోనే ఉన్నాం. మా పరిస్థితిని గుర్తించి ప్రభుత్వం మాఫీ చేయాలి.

\- పుష్పమ్మ, లబ్ధిదారు, ఎస్సీ కాలనీ అమరచింత

మహబూబ్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వారంతా నిరుపేద దళితులు.. వారి సం క్షేమం కోసం 1982లో హైర్ పర్చెస్ సిస్టమ్ కింద అప్పటి ప్రభుత్వం స్థలం కేటాయించి, ఇళ్లను నిర్మించింది. సంవత్సరానికి రూ. 1832 చెల్లించే విధంగా ఆ ఇళ్లను హౌసింగ్ బోర్డు మార్టిగేజ్ చేసుకున్నది. అప్పట్లో ఆ మొత్తం తాము చెల్లించలేమని, తమకు పూర్తి సొమ్మును మాఫీ చేయాలని లబ్ధిదారులు ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఆ ఇళ్ల నిర్మాణం పూర్తయి దాదాపు 42 సంవత్సరాలు అయ్యింది. ఇప్పుడు ఆ ఇళ్ల మార్టిగేజ్ విడిపించుకోవాలంటే ఈ నెలాఖరులోపు రూ. 2,39, 429 చెల్లించాలని లబ్ధిదారులకు హౌసింగ్ బోర్డు నోటీసులు ఇచ్చింది. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొన్నది.

అంత మొత్తం చెల్లించడం తమ వల్ల కాదంటూ వాపోతున్న పరిస్థితి ఉన్నది. వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో 1982 సంవత్సరంలో గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ బీడీ వర్కర్లు 125 మందికి హైర్ పర్చెస్ సిస్టమ్ కింద 125 మందికి ఇళ్ల స్థలాలను ప్రభుత్వం కేటాయించి, ఇళ్లను నిర్మించి ఇచ్చింది. 1985లో ఆ ఇళ్లను గ్రౌండింగ్ చేసి లబ్ధిదారులకు అప్పగించింది. అప్పట్లో ఆ ఇళ్ల నిర్మాణానికి రూ. 16,600 ప్ర భుత్వం ఖర్చు చేసింది.

కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ. 1500లను రాష్ట్ర హౌసింగ్ బోర్డుకు చెల్లించింది. అవి పోను మిగిలిన మొత్తం లబ్ధిదారుల వాటా కింద సంవత్సరానికి రూ. 1832 చొప్పున 20 సంవత్సరాలపాటు చెల్లించాల్సి ఉండగా అప్పటికే కడు పేదరికంలో ఉన్న లబ్ధిదారులు ఆ మొత్తం తాము చెల్లించలేమని ప్రభుత్వానికి విన్నవించుకున్నారు.

కానీ, ఆ బకాయి అలాగే పేరుకుపోయింది. మధ్యలో

మిగతా 6వ పేజీలో...



అమరచింత మునిసిపాలిటీలో నిర్మించిన ఇళ్లు



వనపర్తి జిల్లా అమరచింత మునిసిపాలిటీలో హైర్ పర్చెస్ సిస్టమ్ కింద నిర్మించిన కాలనీ

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

ఊర్కొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన బుధవారం నాగర్‌కర్నూలు జిల్లా ఊర్కొండ మండలంలో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాం ప్రకాష్(34), లవకుశ(35) మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో నివాసం ఉంటున్నారు. రోజువారీలాగే కల్వకుర్తి పట్టణంలో పనులు ముగించుకొని మిడ్జిల్‌కు బయలుదేరారు. కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై రేవల్లి గేటు సమీపంలో ఆగి ఉన్న లారీని వారు వెళుతున్న బైకు బలంగా ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్‌ఐ వీరబాబు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు చెప్పారు.

కోరిన కోర్కెలు తీర్చే... పడమటి అంజన్న

7

- మక్తల్‌లో రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



పడమటి ఆంజనేయస్వామి ఆలయం

మద్దిమడుగులో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

6



ఆంజనేయస్వామి సన్నిధిలో హారతి ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

పవిత్ర మృతికి భర్తే కారణం?

- ఆరోపిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ

7



పవిత్ర గదిలో కల్లు సీసాను పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

జిల్లాలోకి అక్రమంగా కర్ణాటక ధాన్యం

- నామమాత్రంగా చెక్‌పోస్టు ఏర్పాటు
- రాత్రివేళ పట్టించుకోని అధికారులు
- కర్ణాటక రాష్ట్రం యాదగిరి, షాపూరు, కేంభావి, రాయచూరు తదితర ప్రాంతాల నుంచి వందల కొద్దీ వరి బస్తాలతో లారీలు రాక



కర్ణాటక నుంచి అర్ధరాత్రి రాష్ట్రంలోకి వస్తున్న ధాన్యం లారీలు

● 6వ పేజీలో...

అమ్మ ప్రాణానికి రక్ష

- మాతా శిశు సంరక్షణ విభాగంలో ఐదు పడకల ఐసీయూ
- వెంటిలేటర్ సౌకర్యం కూడా ఏర్పాటు
- గర్భిణులు, బాలింతలకు తీరనున్న ఇబ్బందులు

6



ఏర్పాటు చేసిన ఐసీయూ

భూమిని ఆక్రమించిన మాజీ మంత్రి

- భూకేటాయింపులు చేసిన అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలి
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్

మహబూబ్‌నగర్,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తన తల్లిదండ్రులైన శాంతనారాయణగౌడ్ ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి అధికారాన్ని అడ్డం పెట్టుకుని ట్రస్ట్‌కు విలువైన భూమి కేటాయించుకున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్ అన్నారు. దీనిపై ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ట్రస్ట్ ఏర్పాటుచేసి ఆసుపత్రులలో రోగులకు దాని ద్వారా భోజనం అందిస్తామని చెప్పారని, అయితే అక్రమ మార్గంలో అధికారాన్ని దుర్వినియోగం చేసి ఏనుగొండ సర్వేనెంబర్ 25లో పెద్దఎత్తున భూములు కేటాయించుకున్నారని విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ట్రస్ట్ ద్వారా దివ్యాంగులకు స్పోర్ట్స్ స్కూల్ పెడతామని చెప్పి భూములు కేటాయించడంతో పాటు రూ.120 కోట్ల నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. అక్కడ ఎంత భూమి కేటాయించారు? ఎన్ని నిధులు ఖర్చుచేశారు? ట్రస్ట్‌ను ఎవరు నిర్వహిస్తున్నారో వంటి వివరాలు 24 గంటల్లో మాజీ మంత్రి వెల్లడించాలన్నారు.

ఈ భూమిని అక్రమ పద్ధతిలో కేటాయించిన అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ భూ ఆక్రమణపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. నాయకులు సిరాజ్‌ఖాద్రి, సీజె బెనహర్ పాల్గొన్నారు.



సమావేశంలో ట్రస్ట్‌కు కేటాయించిన భూమి ఫొటో చూయిస్తున్న నాయకులు

సేవా కార్యక్రమాల కోసమే ట్రస్ట్ ఏర్పాటు

- ఇకనైనా తప్పుడు ఆరోపణలు మాని పాలనపై దృష్టి పెట్టండి
- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు

మహబూబ్‌నగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు తన తల్లిదండ్రుల పేరుతో శాంతనారాయణగౌడ్ ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి ప్రజలకు సేవా కార్యక్రమాలు చేయాలని 2021లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కె.ఆంజనేయులు అన్నారు. ఈ ట్రస్ట్‌పై కాంగ్రెస్ నాయకులు అర్థం లేని ఆరోపణలు చేస్తూ ప్రజలను గందరగోళ పరిచే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ట్రస్ట్ ద్వారా కరోనా సమయంలో ఎంతో మందికి నిత్యావసర సరకులు, ఆసుపత్రిలో పేదలకు భోజనం అందించే కార్యక్రమాలు చేశారని, పోటీ పరీక్షలో పాల్గొనే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారని, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ట్రస్ట్‌కు ప్రభుత్వ భూమి కేటాయిస్తే భూమిని ఆక్రమించుకున్నారని తప్పుడు ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో తప్పుడు ప్రచారం చేసి లబ్ధిపొందారని, గెలిచి ఏడాదవుతున్నా ఇంకా శ్రీనివాస్‌గౌడ్‌నే విమర్శించడం పనిగా పెట్టుకున్నారన్నారు. భూములు కబ్జా చేశారో నిరూపించాలని సవాల్ చేశారు. శివరాజు, వరదభాస్కర్, గణేష్, సుధాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

బడి బయటి పిల్లల గుర్తింపు కోసం..

ఓఎస్‌సీ సర్వే

- నేటి నుంచి జనవరి 12 వరకు
- 6-14,15-19 ఏళ్ల పిల్లలను వేర్వేరుగా గుర్తింపు
- జిల్లాలో 29 మంది సీఆర్‌పీలు

నారాయణపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో కొందరు పిల్లలు పాఠశాలలకు వెళ్లడం లేదు. ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయ కూలీ పనులకు వెళ్తుంటే ఇంకొందరు కుల వృత్తుల్లో కొనసాగుతున్నారు. మరికొందరు బాలకార్మికులుగా మారుతున్నారు. దాంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని విద్యాశాఖ ప్రతీ ఏటా చర్యలు తీసుకుంటున్నది. బడీడు పిల్లలను గుర్తింపు పేరిట ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ (ఓఎస్‌సీ) సర్వే జిల్లాలో గురువారం నుంచి ప్రారంభించనున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందురాజులు ఆధ్వర్యంలో 29 మంది సీఆర్‌పీలు బడీడు పిల్లలను గుర్తించేందుకు సర్వేబాట పట్టనున్నారు. జనవరి 12వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగనుంది.

సర్వేలో ఇరు వయస్సుల పిల్లల గుర్తింపు

సర్వేలో ఇరు వయస్సు పిల్లలను గుర్తించనున్నారు. 6-14 ఏళ్లలోపు బడీడు పిల్లలు, అలాగే 15-19 ఏళ్ల కళాశాల స్థాయి యువతను గుర్తించి వేరువేరుగా జాబితాను సిద్ధం చేస్తారు. గుర్తించిన విద్యార్థుల సామర్థ్యం, వయస్సు ప్రకారం వీరి అర్హత ఆసక్తిని బట్టి తగిన తరగతిలో చేర్పించటం జరుగుతుంది.

జిల్లాలో పనులకు వలస వచ్చిన వారి పిల్లలు 556 మంది

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా పనుల కోసం వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన పిల్లలు 556 మంది ఉన్నారు. గత సంవత్సరం 2023-24లో బడి బయట సర్వేలో ఎలిమెంటరీ 6-14 వయస్సు పిల్లలు 356 మంది, సెకండరీ స్థాయి 15-19 వయస్సు వారు 37 మంది గుర్తించారు. వీరిని బడుల్లో చేర్పించేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. అలాగే మరో 300 మందిని డీడబ్ల్యూవో ద్వారా గుర్తించి దూరవిద్య ఓపెన్ స్కూల్‌లో చదివేందుకు అప్పటి కలెక్టర్ కోయశ్రీహర్ష ఫీజు కట్టి అడ్మిషన్స్ కల్పించారు. అలాగే జిల్లాలో 2019 ఆర్థిక సంవత్సరానికి గాను 935 మంది బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించారు. 2020 సంవత్సరంలో 782 మంది బడి పిల్లలను, 2022లో 235 మంది బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేలా చర్యలు తీసుకున్నారు.



బడిబయట పిల్లల సర్వేలో సీఆర్‌పీలు(ఫైల్)

బడిబయటి పిల్లల గుర్తింపు కోసం సర్వే



కలెక్టర్ సిక్తా పట్నాయక్ అనుమతితో వివిధ శాఖల మధ్య సమన్వయ సమావేశం నిర్వహించి బడిబయట పిల్లలను గుర్తించేందుకు సర్వే చేపట్టాం. సర్వేలో గుర్తించిన పిల్లలందరిని బడుల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటాం. - విద్యాసాగర్, జిల్లా మానిటరింగ్ అధికారి, నారాయణపేట

ఆరోగ్యశ్రీ వైద్యసేవలు మరింత మెరుగుపరచాలి

● రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రతినిధి డాక్టర్ కె.వి.ఎన్ దుర్గాప్రసాద్



ఆసుపత్రి అధికారులతో మాట్లాడుతున్న డాక్టర్ దుర్గా ప్రసాద్

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జనరల్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్టు ప్రతినిధి డాక్టర్ కె.వి.ఎన్ దుర్గా ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆసుపత్రిలోని సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ కేసుల సమీక్షకు ఆయన హాజరై మాట్లాడారు. ముందుగా ఆరోగ్యశ్రీ కేసులను రిజిస్టర్ చేయాలని, డాటా ఎంట్రీ ఆపరేటర్లు డ్యూటీ రోస్టర్ తయారు చేసుకొని దాని ప్రకారం పని చేయాలన్నారు. అదేవిధంగా ప్రతీ వార్డుకు వెళ్లి వివరాలు సేకరించి నమోదు చేయాలన్నారు. రిజెక్టు అయిన కేసుల వివరాలను ఆయా విభాగాల హెచ్‌వోడీలతో చర్చించి తిరిగి నమోదు చేయాలన్నారు. ప్రతీ విభాగంలో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు మెరుగుపర్చాలని, కేవలం కొన్ని విభాగాలలోనే కేసులు నమోదవుతున్నాయన్నారు. ప్రతిరోజు కేసుల వివరాలు, వాటి పురోగతిని ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంవోలకు నివేదించాలన్నారు.

ఈ సమీక్షలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, ఆయా విభాగాల హెచ్‌వోడీలు, ఆర్ఎంవోలు, ఆరోగ్యశ్రీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు ఇచ్చిన 42 ఏళ్లకు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

కొన్నిసార్లు నోటీ సులు జారీ చేసినా లబ్ధిదారులు చెల్లించలేదు. ప్రభుత్వాలు మారిన ప్రతీసారి ప్రజాప్రతినిధులకు విన్న వించుకున్నప్పటికీ ఆ సొమ్ము మాత్రం మాఫీ కాలేదు. ఇప్పుడు తాజాగా ఫైనల్ నోటీసులను రాష్ట్ర హౌసింగ్ బోర్డు అధికారులు జారీ చేయడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

- 10.5 శాతం వడ్డీతో చెల్లించాలని నోటీసులు

ఫైర్ పర్చెస్ సిస్టమ్ కింద ఇచ్చిన ఇళ్లకు సంబంధించిన సంవత్సరానికి రూ. 1832 చొ ప్పున వాయిదాలు చెల్లించని కారణంగా మొత్తం 125 మంది లబ్ధిదారులకు ప్రస్తుతం ఫైనల్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ నెలాఖరులోపు సంవత్సరా నికి 10.5 శాతం వడ్డీతో కలుపుకొని రూ. 2,39,429 చెల్లించాలంటూ రాష్ట్ర హౌసింగ్ బోర్డు అధికారులు చెబుతున్నారు. ఆ మొత్తం చెల్లించని పక్షంలో ఆ ఇళ్లను జప్తు చేసే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో లబ్ధిదారులు పలువురు ప్రజాప్రతినిధులను కలుస్తున్నారు. ఇప్పటికే ఇళ్లు పొందిన లబ్ధిదారుల్లో చాలామంది మరణించారు. వారి వారసులు వాటిని మరమ్మతులు చేసుకుంటూ అందులో జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికీ వారు బీడీ కార్మికులుగానే ఉంటున్నారు. అంత మొత్తం చెల్లించడం తమ వల్ల కాదంటూ మొరపెట్టుకుంటున్నారు. కేవలం అమరచింత మండలంలోనే కాకుండా రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలో కూడా మరో 52 ఇళ్ల సమస్య కూడా ఇలాగే ఉన్నది. వారికి కూడా ఇప్పుడు ఫైనల్ నోటీసులు మహబూబ్‌నగర్ హౌసింగ్ బోర్డు డివిజన్ అధికారులు జారీ చేశారు. ఇప్పుడు హౌసింగ్ బోర్డుకు ఇచ్చిన మార్టిగేజ్‌ను విడిపించుకోవాలంటే లబ్ధిదారులు కచ్చితంగా నిర్దేశిత మొత్తం చెల్లించాల్సిందే. కానీ, అంత మొత్తం చెల్లించే పరిస్థితుల్లో లబ్ధిదారులు లేరు.

- మాఫీ చేయాలంటున్న లబ్ధిదారులు

ప్రస్తుతం రాష్ట్రంలో ఇందిరమ్మ సర్కారు కొనసాగుతోంది. అప్పట్లో ఇందిరాగాంధీ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలోనే ఈ పేదలకు ఇళ్ల నిర్మాణం చేసి పంపిణీ చేశారు. అలాగే ఇళ్లు లేని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఫైర్ పర్చెస్ సిస్టమ్ కింద రూ. 5 లక్షలు ఆర్థికసాయం చేయాలని భావిస్తోంది.

ఈ క్రమంలో ఇప్పటికీ పేదలుగానే ఉన్న తమకు రాష్ట్ర హౌసింగ్ బోర్డుకు బకాయి ఉన్న సొమ్మును మాఫీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పాలమూరు బిడ్డ అయిన రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో పేదలకు న్యాయం చేయాలని విన్నవిస్తున్నారు. ఆ సొమ్మును కొత్త పథకం కింద వర్తింప చేసి ఇవ్వడమో లేదా ప్రభుత్వమే ఆ సొమ్మును చెల్లించి మార్టిగేజ్‌లో ఉన్న వాటిని విడిపించడమో చేయాల్సిన అవసరం ఉంది.



బకాయి సొమ్ము చెల్లించాలని ఫైనల్ నోటీసు అందజేస్తున్న రాష్ట్ర హౌసింగ్ బోర్డు అధికారులు

అంత డబ్బు కట్టలేం



ఇందిరమ్మ ప్రభుత్వం ఉన్నప్పుడే ఇళ్లు కట్టించి ఇప్పుడు అదే ప్రభుత్వం డబ్బులు చెల్లించాలని నోటీసులు జారీ చేయడం సరికాదు. ఇళ్లు లేని పేదలకు ఇప్పుడు కూడా రూ. 5 లక్షల చొప్పున ఫైర్ పర్చెస్ సిస్టమ్ కింద ఇచ్చేందుకు ప్రభుత్వం పథకం అమలు చేయనుంది. మేము ఎప్పుడో కట్టుకున్న ఇళ్ల సొమ్మును మాఫీ చేయడం లేదా వారికి ఆ డబ్బు చెల్లించి, మాకు పట్టాలు ఇవ్వడం పెద్ద పని కాదు. స్థానిక ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి వాటిని మాఫీ చేయాలి.

- మణెమ్మ, లబ్ధిదారు, అమరచింత

లబ్ధిదారులకు ఫైనల్ నోటీసులు ఇచ్చాం



రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అమరచింతకు చెందిన 125 మంది లబ్ధిదారులకు ఫైనల్ నోటీసులు ఇచ్చాం. ఒక్కొక్కరు రూ. 2.39 లక్షల వరకు చెల్లించాలి. గతంలో కూడా నోటీసులు అందజేశాం. లబ్ధిదారులు అప్పుడు కూడా డబ్బులు చెల్లించలేమని చెప్పారు. ఇప్పుడు కూడా అదే అంటున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి. ఏం చేయాలనే విషయమై రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.

- సంజీవరెడ్డి, హౌసింగ్ బోర్డు ఏ.ఈ., మహబూబ్‌నగర్ డివిజన్

జిల్లాలోకి అక్రమంగా కర్ణాటక ధాన్యం

- నామమాత్రంగా చెక్‌పోస్టు ఏర్పాటు
- రాత్రివేళ పట్టించుకోని అధికారులు
- కర్ణాటక రాష్ట్రం యాదగిరి, షాపూరు, కేంభావి, రాయచూరు తదితర ప్రాంతాల నుంచి వందల కొద్దీ వరి బస్తాలలో లారీలు
- టీఎస్, ఏపీ పాసింగ్ లారీలలో వరి బస్తాలు తరలించేందుకు ఆసక్తి చూపుతున్న అక్రమదారులు

కృష్ణ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల మీదుగా కర్ణాటక రాష్ట్రం రాయచూరు, యాదగిరి, కేంభావి, షాపూర్, తదితర ప్రాంతాల నుంచి అర్ధరాత్రి వందల కొద్ది లారీలు వరి బస్తాలు లోడుతో వస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల సోనా ప్రతి క్వింటాల్‌కు రూ. 2320, బోనస్ రూ. 500 అధిక ధరలకు ఇస్తున్నందున వరి అక్కడి రైతుల నుంచి 75 కేజీల వరికి 1400 నుంచి 1600 ధరకు కొనుగోలు చేసి లారీలలో లోడు చేసి ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న రైస్ మిల్లులకు తరలిస్తున్నారు.

జిల్లా అధికారులు మండల పరిధిలోని గుడెబల్లూరు, కున్సీ గ్రామాల శివారులోని చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి రెవెన్యూ, పోలీస్, వ్యవసాయం శాఖల సిబ్బంది నియమించి విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా పగలు మాత్రం జాతీయ రహదారులపై కర్ణాటక రాష్ట్రం నుంచి వస్తున్న ధాన్యం లారీలు తనిఖీ చేసి వెనుకకు పంపిస్తున్నారు. రాత్రిళ్లు మాత్రం ప్రతీ రోజు అర్ధరాత్రి నుంచి తెల్లవారు జాము దాకా వందల కొద్ది వాహనాలు మండల కేంద్రంలోని రైస్ మిల్ల ర్లతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మక్తల్, మరికల్, జడ్చర్ల, షాద్‌నగర్, నారాయణపేట, హైదరాబాద్, మిల్లర్లు తరలిస్తున్నారు.

పగటిపూట చెక్‌పోస్టులో తనిఖీలు అధికారులు చేస్తున్నా.. రాత్రికి మాత్రం నిద్దుర చేస్తున్నారు. దీంతో వరి అక్రమ దళారులు మాత్రం అధికారులు పడుకొని లేచే సమయానికి అక్కడి ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తూ వ్యాపారులు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయానికి శటగోపం పెడుతున్నారు.

అదే విధంగా కృష్ణ మండల పరిధిలోని సరిహద్దులో ఉన్న గుడూరు, బడియల్, సుగురు, కొంగండి, శివాపూర్ తదితరులు వరి పండించిన రైతుల నుంచి సరిహద్దులో ఉన్న వరి రైతులు పండించిన వరికి కర్ణాటక వరి తమ కల్లాల్లో కల్పి రాష్ట్ర ప్రభుత్వానికి వందల క్వింటాళ్ల వరి ప్రభుత్వానికి విక్రయించినట్లు తెలుస్తున్నది.

కర్ణాటక రాష్ట్రం దొడ్డు రకాల వరి రైస్ మిల్లర్లు కర్ణాటక రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి ప్రభుత్వం నుంచి రైస్ మిల్లర్లు యజమానులు అప్పగించిన వరి ప్రతి క్వింటాల్‌కు 67 కేజీల బియ్యం సోనామసూరి బియ్యం బదులుగా దొడ్డు బియ్యం నిల్వ పెట్టుకుని జిల్లా పౌర సరఫరాల శాఖ పంపిణీ చేసేందుకు సిద్ధంగా మండలంలోని రెండు రైస్ మిల్లుల్లో లాట్‌లు ఉన్నాయి. ఇప్పటికైనా చెక్‌పోస్టు వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి కర్ణాటక వరి ధాన్యం రాకుండా కట్టడి చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధం కావాలని కోరుతున్నారు.

అమ్మ ప్రాణానికి రక్ష

● మాతా శిశు సంరక్షణ విభాగంలో ఐదు పడకల ఐసీయూ

● వెంటిలేటర్ సౌకర్యం కూడా ఏర్పాటు

● గర్భిణులు, బాలింతలకు తీరనున్న ఇబ్బందులు



ఎంసీహెచ్‌లోని ఆపరేషన్ థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన ఐసీయూ

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మాతా శిశు సంరక్షణ విభాగంలో కొత్తగా ఐదు పడకలతో ఐసీయూ విభాగాన్ని ఏర్పాటు చేశారు.

ఇందులోనే వెంటిలేటర్ సౌకర్యాన్ని కూడా కల్పించారు. దీంతో గర్భిణులు, బాలింతల ప్రాణాలకు రక్షణ కల్పించినట్లైంది. ఇటీవల ఐసీయూలో ఓ గర్భిణీ మృతిచెందిన నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇకపై అలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకునే క్రమంలో ఈ ఐసీయూని ఏర్పాటు చేయించారు. అయితే త్వరలో ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా దీన్ని ప్రారంభించనున్నారు.

● ఐసీయూకి తీసుకెళ్లాలంటే గగనమే...

పాత ఆసుపత్రి భవనంలో ప్రసూతి విభాగం, లేబర్ రూం, వార్డులు ఉండేవి. అయితే ప్రత్యేకంగా మాతాశిశు సంరక్షణ విభాగానికి భవనం నిర్మించడంతో గత కొన్నేళ్ల క్రితమే ప్రసూతి విభాగాన్ని ఆ భవనంలోకి మార్చారు. కానీ ఐసీయూ మాత్రం పాత భవనంలోనే ఉండింది. దీంతో ఎంసీహెచ్ విభాగంలో ఉన్న గర్భిణీగానీ, బాలింతకు గానీ ఏదైనా ప్రాణాపాయం సంభవించినా పాత భవనంలోని ఐసీయూకి మార్చాలంటే చాలా ఇబ్బంది ఉండేది.

అక్కడి నుంచి ఇక్కడికి తరలించేలోపు ప్రాణాలకు ప్రమాదం ఉండేది. అయితే తాజాగా గండీడ్ మండలానికి చెందిన ఓ మహిళ కాన్పు తర్వాత ఐసీయూ సేవలు అవసరమై పాత భవనంలోని తరలించారు. కానీ కొన్ని కారణాల వలన ఆమె మృతి చెందారు. దీంతో మృతురాలి బంధువులు తీవ్ర ఆందోళన చేశారు.

ఈ నేపథ్యంలోనే కొత్తగా ఎంసీహెచ్‌లోనే ఐసీయూ విభాగాన్ని ఏర్పాటు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కు మార్ సింగ్ నిర్ణయించారు. ఈ మేరకు కార్యాచరణ ప్రారంభించి 10 రోజుల్లోనే దాన్ని పూర్తి చేశారు.

● ఎంసీహెచ్‌లో ఐదు పడకల ఐసీయూ...

ఎంసీహెచ్ భవనంలోని ఆపరేషన్ థియేటర్ ఎదురుగా ఐసీయూ విభాగాన్ని ఏర్పాటు చేశారు. అందులో ఐదు పడకలతో పాటు ఐదు వెంటిలేటర్లు కూడా ఏర్పాటు చేశారు. దీంతో పాటు నలుగురు నర్సింగ్ సిబ్బంది, ఇద్దరు సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లు, మరో ఇద్దరు డాక్టర్లను కూడా అందులో నియమించారు.

వీరికి షిఫ్టుల వారిగా డ్యూటీలు వేశారు. 24 గంటలు ఈ ఐసీయూ సేవలు పనిచేయనున్నాయి.

● తొలగనున్న ఇబ్బందులు...

ఎంసీహెచ్‌లోని గర్భిణులు, బాలింతలకు ఇకపై ఇబ్బందులు తొలగనున్నాయి. ఆపరేషన్ చేసే క్రమంలో బీపీ ఎక్కువైనా, ఆపరేషన్ చేసిన తర్వాత వచ్చే ఆరోగ్య సమస్యలైనా కచ్చితంగా ఐసీయూ అవసరం ఉంటుంది. అయితే ఐసీయూ సేవల కోసం ప్రత్యేకంగా పాత భవనంలోని ఐసీయూకి తరలించాల్సి ఉండేది. కానీ అదే క్రమంలో ఐసీయూలో పడకలు ఖాళీ లేకపోతే మరో ఇబ్బంది ఉండేది. ఈ ఇబ్బందులకు తావు లేకుండా ఎంసీహెచ్‌లోని గర్భిణులు, బాలింతలకే ప్రత్యేకమైన ఐసీయూని ఏర్పాటు చేయడం వలన చాలా మంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● త్వరలో ప్రారంభం...

కొత్తగా ఏర్పాటు చేసిన ఐసీయూ కేంద్రాన్ని త్వరలో అందుబాటులోకి తెచ్చేందుకు ఆసుపత్రి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పడకలు, సెంట్రల్ ఆక్సిజన్ వ్యవస్థ, వెంటిలేటర్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌ల చేతుల మీదుగా దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి ఐసీయూ సేవలు అందుబాటులోకి రానున్నాయని సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్ తెలిపారు.



అగ్నిగుండం వద్ద పూజ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

ప్రారంభమైన మద్దిమడుగు బ్రహ్మోత్సవాలు

- ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పదర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి, కాశీ విశ్వేశరుడు, అగ్నిగుండం, కోటమైసమ్మ వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ఏర్పాట్లు చూశారు. కొన్ని నూతన గదులను, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్యాబ్‌లను ప్రా రంభించారు. అంతకు ముందు చైత్రశుద్ధ ఏకాదశి ప్రాతఃకాల సమయంలో ఆలయ ప్రధాన అర్చకులు వీరయ్య శాస్త్రీతో పాటు, వేదపండితులు శివార్చకం శివప్రసాద్‌శర్మ, రఘుశర్మ మంత్రోచ్ఛారణాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆల యంలో నిత్యార్చన, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణం, రాత్రి ఊష్టవాహన సేవ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాములు నాయక్, ఈఓ రంగాచారి, ఆలయ పాలక మండలి సుబ్బదాను, వెంకట్, శ్రీను, ఆంజనేయులు ఉన్నారు.

నేటి కార్యక్రమాలు

ఉదయం విఘేశ్వర పూజ, పంచగవ్యం, వాస్తు పూజ, హోమం, రుద్రహోమం, సహస్రనామార్చన, బలాహరణ, నీరాజనం, సాయంత్రం నిత్యోపాసన, మన్యూసూక్త హోమం, చండీ హోమం, బలిహరణ, తీర్థ ప్రసాద వితరణ, రాత్రికి అశ్వవాహన సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయి.

వృద్ధుడి అదృశ్యం

ఆత్మకూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలమల్లకు చెందిన పెంట గుంత రంగన్న ఈ నెల 7వ తేదీన అదృశ్యమైనట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూరుకు వెళ్లొస్తానని భార్యతో చెప్పి, తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాలు బంధువులను అడిగి తెలుసుకున్నా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం స్టేషన్‌లో కుమారుడు ఫిర్యాదు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయనకు ఒక కాలు విరిగింది. స్టాండ్ పై నడుచుకుంటూ వెళ్లేవాడు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలపాలని ఎస్ఐ కోరారు.

సైన్స్‌తోనే మనుగడ

-విద్యార్థుల మేథాశక్తికి సైన్స్ ప్రదర్శనలు దోహదపడతాయి

నాగర్‌కర్నూల్/నాగర్‌కర్నూల్‌టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌తోనే మానవుడి మనుగడ ముడిపడి ఉందని, విద్యార్థులు కొత్త ఆవిష్కరణలను రూపొందించి నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతిష్టను దేశస్థాయిలో ఇనుమడింపజేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. జిల్లా స్థాయి బాలవైజ్ఞానిక ప్రదర్శనలు 2024 కార్యక్రమాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవుడి ఎదుగుదలకు సైన్స్ అత్యంత కీలకమని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి సైన్స్‌లో ప్రయోగాలు, నూతన ఆవిష్కరణలు రూపొందించే దిశగా ఎదగాలని సూచించారు. విద్యార్థి జీవితంలో సమయాన్ని సద్వినియోగం చేసుకున్న వాళ్లే విజేతలుగా నిలుస్తారన్నారు. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి మెదడు సైన్స్‌తోనే అనుసంధానమై ఉంటుందని తెలిపారు. తాను కూడా సైన్స్ విద్యార్థినని చెప్పారు. విద్యార్థులు విద్యతో పాటు వివిధ రంగాల్లో రాణించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్‌రావు, నోడల్ అధికారి కుర్మయ్య, హెచ్ఎంలు ఉన్నారు.



కొండ చరియలు విరిగి పడిప్పుడు హెచ్చరిక వ్యవస్థ

కొండ చరియలు విరిగిపడినప్పుడు సంభవించే ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించేందుకు, వాటి కిందపడిన బాధితుల్ని రాత్రి సమయంలో కూడా సులభంగా గుర్తించడంలో సహాయపడే ప్రాజెక్టు నమూనా ఆకట్టుకున్నది. కొండ ప్రాంతాల్లో అమర్చిన ప్రత్యేక డివైజ్‌కు వర్షాల కారణంగా జారిన మట్టి తడి తగలడం వల్ల రెడ్ లైట్ వెలగడంతో పాటు హెచ్చరిక శబ్దం చేస్తుంది. దీంతో సమీప ప్రజలు అప్రమత్తమయ్యే అవకాశం ఉంది. ఆదే సమయంలో ప్రమాదంలో చిక్కుకున్న వారు జింక్ సల్ఫేట్, స్ట్రాటియం అల్యూమినేట్ పూత వేసిన కాగితపు ముక్కలతో నింపిన సిలిండర్ స్ప్రేచేయడం ద్వారా వారిని సులభంగా వెలికి తీయవచ్చు.

- వరుణ్, భార్గవి, జడ్పీహెచ్ఎస్ లట్టుపల్లి, బిజినేపల్లి మండలం

ఫ్లడ్-వాటర్ లెవల్ డిటెక్టర్ వ్యవస్థ



రిజర్వాయర్లకు వరదలు వచ్చినప్పుడు వాటర్ లెవల్‌ను ఒక అధికారి గమనిస్తూ ఉండాలి. ఆ అవసరం లేకుండాగానే ప్రత్యేకంగా అమర్చిన ఎలక్ట్రానిక్ పరికరం తో వరదలు, వాటర్ లెవల్స్‌ను తెలుసుకోవచ్చు. రిజర్వాయర్ గరిష్ట నీటి మట్టం పాయింట్ అమర్చిన ఎలక్ట్రానిక్ పరికరం రెడ్ లైట్ వెలగడంతో పాటు అలారం మోగుతుంది, దీంతో అప్రమత్తమై రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో పాటు సమీప ప్రజలను అప్రమత్తం చేయవచ్చు.

రేహన్, అనిల్, జడ్పీహెచ్ఎస్ కల్వకుర్తి

ఆవు పేడతో విద్యుత్ ఉత్పత్తి



ఆవు పేడను రెండు సమ భాగాలుగా చేసి వేర్వేరు డబ్బాల్లో వేసి వైర్లు అమర్చిన జింక్, రాగి కడ్డీలను ఆ డబ్బాలో ఉంచాలి, వాటి వైర్లను బ్యాటరీ లేని గడియారం వేర్వేరు ధ్రువాలకు అనుసంధానం చేస్తే అది పని చేయడం ప్రారంభిస్తుంది. విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించిన ఆవు పేడను వ్యవసాయ పొలంగా సహజ ఎరువుగా ఉపయోగించవచ్చు. ఇలా తయారు చేసిన విద్యుత్‌ను దేనికైనా వినియోగించవచ్చు.

- భార్గవి, జడ్పీహెచ్ఎస్ పోతేపల్లి, వెల్దండ మండలం

పవిత్రది ముమ్మాటికీ వరకట్న హత్యే..

గద్వాల క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బోయ పవిత్రను ప్రేమ వివాహం చేసుకొని కట్నం కోసం చిత్రహింసలకు గురిచేస్తున్న వినయ్‌తో పాటు బాధ్యులను కఠినంగా శిక్షిస్తూ వరకట్న హత్య కేసు నమోదు చేయాలని చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి డిమాండ్ చేశారు. పవిత్ర మృతి విషయం తెలిసి చైతన్య మహిళా సంఘం సభ్యులు బుధవారం పట్టణంలోని పవిత్ర ఉరివేసుకున్న స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని పవిత్ర మృతదేహాన్ని పరిశీలించి పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్‌తో మాట్లాడారు. పవిత్ర మృతి సహజ మరణం కాదని, ఆమె భర్తే ప్రధాన కారకుడన్నారు. డిసెంబరు 10వ తేదీన మానవ హక్కుల దినం రోజే వినయ్ పవిత్రను హత్య చేశారన్నారు. మానవ హక్కుల దినం రోజు మహిళలకు జీవించే హక్కు లేదని పవిత్ర మరణం రుజువు చేసిందన్నారు. పవిత్ర మృతికి కారణమైనా వారిని ఎవరినీ వదలకండని ఎస్ఐ కళ్యాణ్‌కుమార్‌ను కోరారు. కార్యక్రమంలో చైతన్య మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రేవతి, సభ్యురాలు వెంకటమ్మ ఉన్నారు.



పవిత్ర మృతికి కారణమైన వారిని శిక్షించాలని ఎస్ఐ కళ్యాణ్ కుమార్‌ను కోరుతున్న చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ జ్యోతి

త్వరలోనే పాడి రైతులకు బకాయిలు చెల్లింపు

- విజయ డెయిరీ ఎండీ కట్ట చంద్రశేఖర్‌రెడ్డి

ఉప్పునుంతల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : త్వరలోనే పాడి రైతులకు పాల బకాయిలు చెల్లించేందుకు కృషి చేస్తామని విజయ డెయిరీ ఎండీ కట్టా చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఐఏఎస్ పదోన్నతి పొంది బుధవారం స్వగ్రామమైన ఉప్పునుంతలకు వచ్చిన సందర్భంగా ఆయనను గ్రామస్థులు, రైతులు, నాయకులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాడి రైతులకు రూ.90 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. 45 రోజులకు సంబంధించిన బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం రూ.50 కోట్లు ఇచ్చేందుకు అంగీకారం తెలిపిందన్నారు. విజయ డెయిరీకి అధికంగా పాలు వస్తున్నాయని, ఎండీగా బాధ్యతలు స్వీకరించిన తదుపరి 50 వేల లీటర్ల వ్యాపారం పెరిగిందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు అనంతరెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, పర్వత్‌రెడ్డి, బుసిరెడ్డి, ధర్మారెడ్డి, గోవర్ధరెడ్డి, మాజీ సర్పంచ్ సరిత ఉన్నారు.



విజయ డెయిరీ ఎండీ కట్టా చంద్రశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చోరీలకు చెక్



డ్రోన్ కెమెరాను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు(ఫైల్)

గద్వాల క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో కొంతకాలంగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇంటిముందు ఉంచిన బైకులు, తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేస్తున్న సంఘటనలు జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్న విషయాలు అందరికి తెలిసిందే. గతంలో చోరీలు జరిగినా రివవరీ చేయకపోవడంతో బాధితులు ఆందోళన చెందారు. ఇప్పుడిప్పుడే జిల్లాలో కొన్ని నేరాలకు సంబంధించి రికవరీ కావడంతో జిల్లా ప్రజల్లో కొంత ఆశలు చిగురిస్తున్నాయి.. గతంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి రికవరి జరుగొచ్చేమో అని బాధితులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

35 బైకుల రికవరీ..

జల్సాలకు అలవాటు పడిన ఎనిమిది మంది యువకులు బైకులను తీసుకెళ్లి తక్కువ ధరకు విక్రయించేవారు. ఇందులో ఆరుగురిని అరెస్ట్ చేసి రూ. 30 లక్షల విలువచేసే 35 బైకులను రికవరీ చేశారు. అలాగే ప్లాట్ అమ్మిన డబ్బులను కారులో ఉంచి తండ్రీకొడుకులు ఒక హోటల్‌లో భోజనం చేసేందుకు వెళ్లారు. భోజనం ముగించి వచ్చే సరిగా కారులో ఉన్న రూ. 3.60 లక్షలను ఎత్తుకెళ్లారు. చోరీకి పాల్పడిన నెల్లూరు జిల్లాకు చెందిన ప్రసంగిని పట్టుకొని రూ. 3.10 లక్షలను రికవరీ చేశారు. వీటితో పాటు నిరుద్యోగుల నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇలా మోసం చేసిన వారిలో వనపర్తి జిల్లాకు చెందిన పసుల అంకిత, ఆమె భర్త జగీశ్వర్‌రెడ్డితో పాలు గద్వాల పట్టణం, రూరల్‌కు చెందిన మరికొందరిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

సిబ్బంది కొరతతో ఇబ్బంది..

జోగుళాంబ గద్వాల జిల్లాలో పోలీసుశాఖలో సిబ్బంది కొరతతో కొంత ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. ఇటీవలే 72 మంది నూతనంగా శిక్షణ పొందిన పోలీస్ కానిస్టేబుల్స్ రావడంతో జిల్లాలో కొద్దిగా ఊరట లభించింది. అయితే ఇంకా పోలీస్ సిబ్బంది కొరత ఉన్నా ప్రస్తుతానికి వచ్చిన సిబ్బందితో సర్దుబాటు చేస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలో నేరాలు నియంత్రించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెడుతున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న చైన్‌స్నానింగ్‌లతో పాటు ఒకేసారి మూడు, నాలుగు ఇళ్లలో జరిగిన చోరీలకు పాల్పడిన వారిని అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు త్రీ లేయర్ బీట్ సిస్టం



జిల్లాలో పెండింగ్ కేసులను ఛేదించేందుకు కృషి చేస్తున్నాము. ఇటీవలే కొన్నింటిని రికవరీ చేశాం. లక్షల విలువచేసే బైకులను రికవరీ చేశాం. త్రీ లేయర్ బీట్ (స్టేషన్ లెవల్, సబ్‌డివిజన్ లెవల్, జిల్లా లెవల్ బీట్) సిస్టంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తాం. నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తాం. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

- శ్రీనివాసరావు, ఎస్పీ

క్రైం కార్నర్

రేషన్ బియ్యం పట్టివేత

కోస్గి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఓ వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నారాయణపేట జిల్లా కోస్గి నుంచి బొలెరో వాహనంలో దాదాపు 20 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్థానిక శివాజీ కూడలి వద్ద పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో డీటీ ఆనంద్ పంచనామా నిర్వహించారు. బొలెరో యజమాని మల్లేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మరికల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని తీలేరు గ్రామ స్టేజీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం అయ్యింది. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో, వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అతడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని ఎస్‌ఐ రాము కోరారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

కృష్ణ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కృష్ణ మండల పరిధిలోని మురహర్‌దొడ్డి గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్వ కథలప్ప (48) రెండు రోజుల క్రితం పొలానికి వెళ్లి పడుకొని అక్కడే మృతి చెందాడు. ఆయన ఇంటికి రాకపోవడంతో భార్య, పిల్లలు బంధువులు, తెలిసిన వారికి ఫోన్ చేసి ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో పొలంలో పడి ఉన్న మృతదేహాన్ని బుధవారం స్థానికులు గమనించి, కుటుంబసభ్యులకు తెలిపారు. వారిచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వంగూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని పోల్కంపల్లి సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని డిండిచింతపల్లి గ్రామానికి చెందిన పరమేశ్ ద్విచక్రవాహనంపై కల్వకుర్తికి వెళ్లి తిరిగి వస్తుండగా, పోల్కంపల్లి పెట్రోల్ బంక్ వద్ద అదుపు తప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో పరమేశ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి, 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

బావపై బావమరుదుల దాడి

ఖిల్లాఘణపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం గ్రామానికి చెందిన నరేశ్‌పై మంగళవారం బావ మరుదులు దాడి చేసి గాయపరిచారు. ఎస్‌ఐ సురేశ్ గౌడ్ తెలిపిన వివరాలు.. అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన నరేశ్ దంపతుల మధ్య మూడు నెలల క్రితం గొడవ జరిగింది. ఈ విషయంపై మాట్లాడు కుందామని మంగళవారం అతడి బావమరిది సురేశ్ అతడిని పిలిచాడు. దీంతో బాలిసాబ్ దర్గా వద్దకు చేరుకున్న నరేశ్, సురేశ్ మాట్లాడు కుంటుండగా, బావమరుదులు శేషయ్య, రవికుమార్, బాలీశ్వర్ అక్కడికి వచ్చారు. సురేశ్ వారితో కలిసి నరేశ్‌పై కర్రలతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో బోల్తా, డ్రైవర్‌కు గాయాలు



బోల్తా పడిన ట్రాలీ ఆటో

ఊర్కొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండల కేంద్రంలో ట్రాలీ ఆటో బోల్తా పడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జడ్చర్ల నుంచి కల్వకుర్తికి సిమెంట్ లోడ్‌తో వస్తున్న ఆటో ఊర్కొండ మండల కేంద్రం సమీపంలో, ఊర్కొండపేట శివారులో బోల్తా పడింది. ఆటో డ్రవర్ స్వల్పంగా గాయపడ్డాడు. ట్రాలీ ఆటో చక్రాల మధ్య ఉన్న రాడ్ విరిగిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు డ్రైవర్ తెలిపారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి

కొత్తకోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలోని పశువుల ఆసుపత్రి సమీపంలోని డ్రైనేజీలో పడి ఉన్న బుధవారం స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. శవాన్ని పరిశీలించిన పోలీసులు భవానీనగర్‌కు చెందిన వెంకటేశ్ (42)గా గుర్తించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంకటేష్ మంగళవారం భార్యతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లి మద్యం తాగినట్లు సమాచారం. అలాగే కల్వర్టుపై పడుకొని, నిద్రలో పొర్లి డ్రైనేజీలో పడినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూతగాదాలో మహిళపై దాడి

ఖిల్లాఘణపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని సల్కెలాపూర్ గ్రామానికి చెందిన మహిళపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. ఎస్‌ఐ సురేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనిత భర్త లక్ష్మయ్య, స్వామి, విష్ణు ముగ్గురూ అన్నదమ్ములు. ఇంటి స్థలం విషయంలో గతంలో వారి మధ్య గొడవలు జరిగాయి. స్వామి, విష్ణు కలిసి పొలంలో బోరు వేసుకున్నారు. బోరు ఉన్న పొలాన్ని మీరు తీసుకొని, వేరే పొలాన్ని తమకు ఇవ్వాలని ఈ నెల 10న స్వామి, విష్ణులను అనిత కోరింది. దీంతో వారిద్దరూ ఆమెపై కర్రతో దాడి చేసి గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

గద్వాల క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రాఘవేంద్రకాలనీలో నివసించే రిటైర్డ్ ఉద్యోగి అమర్ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమర్ కుటుంబంతో కలిసి మంగళవారం ధరూరు మండలంలోని ఉప్పేరు గ్రామానికి వెళ్లి బుధవారం తిరిగి వచ్చారు. అప్పటికీకే ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి లోనికి వెళ్లి పరిశీలించారు. మూడు తులాల బంగారు నగలు, 18 తులాల వెండి వస్తువులు, రూ. 18 వేలు చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్‌ఐ కల్యాణ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

చిన్నంబావి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని పెద్దదగడ గ్రామంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. గ్రామంలో బుధవారం జరిగిన సీఎం కప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు కొప్పునూర్ గ్రామానికి చెందిన తగరం సందీప్, ఎల్లస్వామి ద్విచక్ర వాహనంపై గ్రామానికి వస్తుండగా, దారిలో బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. ప్రమాదంలో సందీప్‌కు బలమైన గాయం కావడంతో స్పృహ కోల్పోయాడు. స్థానికులు కుటుంసభ్యులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగ్రాతుడిని హైదరాబాద్‌కు తరలించారు. స్వల్పంగా గాయపడిన ఎల్లస్వామిని కుటుంబసభ్యులు వనపర్తి ఆసుపత్రికి తీసుకెళ్లారు.

కోరిన కోర్కెలు తీర్చే... పడమటి అంజన్న

» మక్తల్‌లో పశ్చిమాభిముఖంగా వెలసిన హనుమంతుడు » రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు
» 14న ప్రభోత్సవం, 15న రథోత్సవం, 16న పాల ఉట్లు » ప్రతీ రోజు వాహన సేవలు



పడమటి ఆంజనేయస్వామి మూలవిరాట్

మక్తల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా మక్తల్ పట్టణంలో వెలిసిన పడమటి అంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారం భం కానున్నాయి. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త ప్రాణేషాచారీ, ఈవో శ్యామ్‌సుందర్ చారీ తెలిపారు. 13న ఉదయం ఏడు గంటలకు ఉత్తరాది మఠం నుంచి స్వామి వారి ఊరేగింపు ప్రారం భం అవుతుంది. ఎనిమిది గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, అలంకారోత్సవం నిర్వహిస్తారు. 8.30 గంటలకు హనుమాన్ వ్రతం, సాయంత్రం ఆరు గంటలకు గజవాహన సేవ ఉంటాయి. 14న ఉదయం 10 గంటలకు పవమాన హోమం, సాయంత్రం ఆరు గంటలకు నెమలి వాహన సేవ నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రభోత్సవం, 15న సాయంత్రం మూడు గంటలకు పల్లకీసేవ, ఆరు గంట లకు రథోత్సవం నిర్వహించనున్నారు. 16న సాయంత్రం హంస వాహన సేవ, ఆరు గంటలకు పాలఉట్ల ఉత్సవం ఉంటుంది. 17న చక్రతీర్థ స్నానం, అశ్వవాహన సేవ, 18న సాయంత్రం ఆరు గంటలకు ఉష్ట్ర వాహన సేవ, 19న సాయంత్రం ఆరు గంటలకు కల్పవృక్ష వాహన సేవతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, గుజరాత్ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

మక్తల్‌గా మారిన మఖస్థలి

మఖ అంటే యజ్ఞం, స్థలి అంటే స్థలం. పూర్వకాలం ఈ ప్రాంతంలో యజ్ఞ యాగాదులు విరివిగా నిర్వహించేవారు. అందుకే ఈ ప్రాంతానికి మఖస్థలి అనే పేరు వచ్చింది. కాలక్రమంలో అది ఆ పేరు మక్తల్‌గా మారి నిలిచిపోయింది. ఇక్కడి గుడిలో ఉన్న విగ్రహాన్ని జాంబవంతుడు ప్రతిష్ఠించారని, ఆయన యమధర్మరాజు అంశ కావడంతో స్వామిని పూజిస్తే మృత్యుదోశాలు పూర్తిగా తొలిగిపోయి దీర్ఘాయుష్షు కలుగుతుందని భక్తుల నమ్మకం.

పశ్చిమం వైపు ఒరిగి ఉన్న స్వామి

ఆలయంలోని అంజనేయస్వామి విగ్రహం పశ్చిమం వైపు ఒరిగి ఉంటుంది. దీనిపై పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ప్రస్తుత అర్చక వంశానికి చెందిన పూర్వుజుడు పొట్టిగా ఉండటం వల్ల స్వామి వారికి బొట్టు పెట్టేందుకు తీవ్రంగా ఇబ్బంది పడేవాడు. ఆయన మొర ఆలకించిన స్వామి పశ్చిమం వైపు ఒరిగి, పూజలందుకున్నాడు. అలాగే మరో కథనం కూడా ప్రచారంలో ఉంది. పూర్వం ఒక రోజు ప్రధాన అర్చకుడు పని మీద వేరే చోటకు వెళ్లాల్సి వచ్చింది. దీంతో తన కుమారుడికి స్వామి వారి అర్చన బాధ్యతలు అప్పగించి వెళ్లాడు. కుమారుడు చిన్నవాడు కావడంతో స్వామి వారికి నైవేద్యాన్ని స్వయంగా సమర్పించాలని అనుకున్నాడు. కానీ విగ్రహం అతడికి అందలేదు. దీంతో తండ్రి దండిస్తాడేమోనన్న భయంతో బాలుడు ఆత్మార్పణకు సిద్ధమయ్యాడు. దీంతో స్వామి వారు ప్రత్యక్షమై బాలుడి నైవేద్యం స్వీకరించారని, అందుకే విగ్రహం పశ్చిమం వైపునకు ఒరిగి ఉందని చెప్తుంటారు.

గోపురం వద్దన్న ఆంజనేయస్వామి

పడమటి ఆంజనేయ స్వామి గర్భాలాయినికి గోపురం లేకపోవడం మరో విశిష్టత. పూర్వం రెండుసార్లు గోపురం నిర్మించేందుకు ప్రయత్నించగా పగుళ్ల వచ్చి కూలి పోయింది. అప్పటి అర్చకుడికి రాత్రి కలలో స్వామి వారు ప్రసన్నమై, సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం లోపు ఆగమశాస్త్ర ప్రకారం గోపురం నిర్మిస్తేనే నిలుస్తుందని చెప్పారట. ఒక్క రోజులో గోపురం నిర్మించడం సాధ్యపడకపోవడంతో ఇప్పటి వరకు నిర్మించలేదని భక్తులు చెప్తుంటారు.

జాంబవంతుడు ప్రతిష్ఠించిన విగ్రహం

పడమటి అంజనేయస్వామి ఆలయానికి దాదాపు ఐదు వందల ఏళ్లకు పైగా విశిష్టమైన చరిత్ర ఉందని గ్రామ పెద్దలు చెప్తుంటారు. సాక్షాత్తు జాంబవంతుడి చేతుల మీదుగా ఆంజనేయ స్వామి విగ్రహాన్ని పశ్చిమాభిముఖంగా ప్రతిష్ఠించినట్లు పురాణ కథనం. అందుకే స్వామి వారికి పడమటి ఆంజనేయస్వామిగా పేరు వచ్చింది. దేశం మొత్తం మీద పడమటి దిక్కు వైపు ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం ఇక్కడ మాత్రమే ఉందని చెప్తుంటారు. క్షేత్రంలో భక్తులు గండదీపం వెలిగించి, స్వామికి దాసంగాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు ఆలయ పరిసరాల్లో భక్తులు నిద్ర చేస్తే పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. రథోత్సవం, పాలఉట్ల కార్యక్రమాలు ముగిసిన తర్వాత, భక్తులు స్వామిని దర్శించుకొని స్వగ్రామాలకు తిరుగు ప్రయాణం అవుతారు.

బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



మక్తల్ పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. ఉత్సవాలకు తరలి రానున్న వేలాది మంది భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. క్షేత్రంలో తాగునీరు, విద్యుత్‌సరఫరా తదితర వసతులు కల్పిస్తున్నాం. అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందించేందుకు సిబ్బందిని నియమిస్తున్నాం. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నాం.

- శ్యామ్‌సుందర్‌చారి, ఈవో.

భక్తిశ్రద్ధలతో మూల రాముల పూజ

» మల్దకల్‌లో కొనసాగుతున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

మల్దకల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జి ల్లా మల్దకల్ మండల కేంద్రంలో స్వ యంభువు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ప్రతీ రోజు పలువురు పీఠాధిపతులు, స్వాములు ఆలయాన్ని సందర్శించుకొని, స్వామికి పూజలు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్నారు. ఉడుపి పలిమార్ పీఠాధిపతి విద్యాధీశ తీర్థ స్వామి బుధవారం ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, పురోహితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మూల రాముల పూజలు చేసి, దశ విధ హారతులు సమర్పించారు. ఆ తర్వాత వేద పాఠశాలను సందర్శించారు. సాయంత్రం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విష్ణు సహస్ర నామ పారాయణం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భక్తులకు ఆశీర్వచన సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి, వేద పండితులు మధుసూ దనాచార్యులు, రమేశాచార్యులు, రవి ఆచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.



మూల రాముల పూజ చేస్తున్న విద్యాదీశ తీర్థ స్వామి

పవిత్ర మృతికి భర్తే కారణం?

» ఆరోపిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు » సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ » వరకట్నం వేధింపుల కేసు నమోదు



పవిత్ర నివసించిన ఇంటి యజమానితో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ, ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్

గద్వాల క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బీటెక్ విద్యార్థిని బోయ పవిత్ర మృతికి ఆమె భర్తనే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సంఘటనపై పూర్తి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. జిల్లా ఆసుపత్రిలోని మార్చురీలో ఉన్న పవిత్ర మృతదేహాన్ని బుధవారం డీఎస్పీ సత్యనారాయణ పరిశీ లించారు. తర్వాత పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్, బాధిత కుటుంబ సభ్యులతో కలిసి పవిత్ర నివసించిన గదికి చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించారు. ఫ్యాను మూడు రెక్కల్లో ఒకే రెక్కకు ఉరి వేసుకోవడం ఎలా సాధ్యం అవుతుందని కుటుంబ సభ్యులు డీఎస్పీ వద్ద అనుమానం వ్యక్తం చేశారు. దీంతో కుటుంబ సభ్యులతో ఒకరిని ఫ్యాను రెక్కను పట్టుకొని వేలాడమని చెప్పి, పరిశీలించి చూశారు. గదిలో ఉన్న కల్లు బాటిల్‌ను, బయట ఉన్న ఖాళీ మద్యం సీసాలను పరిశీలించారు. సూసైడ్ నోట్ ఏమైనా రాసిందేమో పరిశోధిస్తామని డీఎస్పీ తెలిపారు. కాగా పవిత్ర మృత దేహానికి పోస్టుమార్టం చేసేందుకు కుటుంబ సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ వారితో మాట్లాడి నచ్చచెప్పారు. సంఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి, నిందితులకు శిక్ష పడేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు సమ్మతించారు.

అనంతరం గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్ పంచనామా చేశారు. పవిత్ర మృతిపై ఆమె తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు భర్త, అతడి కుటుంబ సభ్యులపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు.

గద్వాల వాసికి జ్యోతిష్య ఆచార్య పురస్కారం

గద్వాల టౌన్, కొత్తకోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన జ్యోతిష్యుడు వల్లూరు వేణు గోపాల్‌రావుకు జ్యోతిష్య ఆచార్య పురస్కారం లభించింది. తిరుమల తిరుపతి క్షేత్రంలోని మహతి ఆడిటో రియంలో, ఎన్‌ఎస్ లైవ్ ఆస్ట్రో ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జ్యోతిష్య మహాసభ, సెమినార్‌లో నిర్వాహకులు వేణు గోపాల్‌రావును ఘనంగా సన్మానించి పురస్కారం అందించారు. జ్యోతిష్యంపై వేణుగోపాల్ రావు రచించిన పలు వ్యాసాలు జాతీయ స్థాయి పత్రికల్లో ఇప్పటికే ప్రచురితమయ్యాయి. ఈ సందర్భంగా వేణుగోపాల్ రావు, మాట్లాడు తూ తన గురువులు చాగాపురం శేషాచార్యు లు, వీఎస్ఎన్ మూర్తి, శివరంజన్, తల్లిదం డ్రుల ఆశీస్సులతో తనకు పురస్కారం లభిం చిందని తెలిపారు.

15న కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికకు ఈనెల 15న పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తి గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జనగామ జిల్లాలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ టోర్నీలో పాల్గొననున్నట్లు తెలిపారు. బాలురు 70 కిలోల లోపు, బాలికలు 65 కిలోల లోపు బరువు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు జిల్లా ప్రధాన స్టేడియానికి చేరుకోవాలని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారులకు మాత్రమే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, చిత్రంలో ఎస్‌ఐ, సీఐ, సిబ్బంది

కల్వకుర్తి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత గుట్కా, పొగాకు ప్యాకెట్లను పట్టుకున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి డీఎస్పీ పి.వెంకటేశ్వర్లు తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డిలతో కలిసి మాట్లాడారు. కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో బుధవారం సాయంత్రం సీఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డి సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో చౌరస్తా వైపు నుంచి వస్తున్న ఆటోను ఆపేందుకు యత్నించారు. కానీ డ్రైవర్ ఆపకుండా ఆటోను వేగంగా నడుపుతూ తప్పించుకొనేందుకు యత్నించాడు. దీంతో పోలీసులు వెంటాడి అతడిని పట్టుకొని విచారించగా, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కల్‌పాడు గ్రామానికి చెందిన నరసింహగా గుర్తించారు. ఆటోను తనిఖీ చేయగా, సంచుల్లో నిషేధిత పొగాకు, గుట్కా ప్యాకెట్లు ఉన్నాయి. ఆమనగల్లుకు చెందిన తన యజమాని క్రాంతికుమార్ సూచన మేరకే గుట్కా, పొగాకు బస్తాలను కల్వకుర్తిలోని వ్యాపారులకు ఇచ్చేందుకు తీసుకొస్తున్నట్లు నరసింహ వారికి తెలిపారు. ఈ సందర్భంగా రెండు లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరించారు.

మొక్కజొన్న పంటల పరిశీలన



రైతులతో కలిసి మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు

జడ్చర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్ నగర్ జిల్లా, జడ్చర్ల మండలం, కోడ్గల్ గ్రామ సమీపంలో మొక్కజొన్న పంటను బుధవారం భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సునీల్, డాక్టర్ నగేశ్‌కుమార్ పరిశీలించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు, కలుపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. కత్తెర పురుగు నివారణకు లీటరు నీటిలో 0.5 మిల్లీ లీటర్లు స్పైనిటోరమ్, లేదా 0.4 మిల్లీ లీటర్లు కోరాజెన్, లేదా 0.4 మిల్లీ లీటర్లు ఆంప్లిగో మందును కలిపి పిచికారి చేయాలని సూచించారు. కలుపు నివారణకు ఎకరానికి 1300 మిల్లీ కాలరీస్ ఎక్స్‌ట్రా, లేదా 110 ఎంఎల్ లాడిస్‌ను చల్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల అధికారి గోపీనాథ్, ఏఈవోలతో పాటు రైతులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సిములు, సాయిరెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

అంతరాయం లేని విద్యుత్ సరఫరా చేస్తాం

టౌన్-2 ఏఈ ఆదిత్య



పాలమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రజలకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని టౌన్-2 ఏఈ వి.ఆదిత్య అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

టౌన్-2 పరిధిలో ఏ సమస్యలు ఉన్నాయి?

విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నాయి. జిల్లా కోర్టు, ఆర్అండ్‌బీ, ఎస్పీ కార్యాలయ ఆవరణలో చెట్ల కొమ్మలు కొట్టేందుకు త్వరగా అనుమతి ఇవ్వరు. దీంతో టౌన్-2 పరిధిలో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. మా పరిధిలో ఉన్న అధికారులకు సమస్యను వివరిస్తున్నాం.

విద్యుత్ సరఫరాకు మెటీరియల్ ఇబ్బంది ఉందా?

చెప్పుకోదగిన ఇబ్బంది లేదు. కానీ మునిసిపాలిటీ పరిధిలో చెట్ల కొమ్మలు కొట్టించడంతో పాటు రెగ్యులర్‌గా డిస్ట్రిబ్యూషన్ బాక్సులు ఇస్తే బాటుంటుంది.

ప్రజలు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదనే ఆరోపణ ఉంది?

ఈ మధ్య కాస్త పని ఒత్తిడి ఉండటంతో ఫోన్ లిఫ్ట్ చేయలేదు. మామూలు పరిస్థితిలో మా సిబ్బంది అలా చేయరు.

టౌన్-2 పరిధిలో కనెక్షన్లు ఎన్ని, ఎంత మంది సిబ్బంది ఉన్నారు?

టౌన్-2 పరిధిలో సమారు 21,800 కనెక్షన్లు ఉండగా, 21 మంది సిబ్బంది ఉన్నారు. మరో ఐదుగురు సిబ్బంది అవసరం.

న్యూస్ బాక్స్

తీరిన నీటి ఎద్దడి

జడ్చర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలోని రెండో వార్డులో నీటి ఎద్దడి నివారణకు బాలవికాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోర్లు డ్రిల్ చేయడంతో నీటి ఎద్దడి తీరింది. బుధవారం రెండో వార్డు కౌన్సిలర్ బుక్క మహేష్ ఆధ్వర్యంలో హ్యాండ్‌సెట్‌లను ప్రారంభించారు. వార్డు ప్రజలు సుగుణమ్మ, బాలీశ్వరి, శ్రీనివాసులు, రాహుల్ పాల్గొన్నారు.

పెరిగిన ఉల్లి ధరలు

దేవరకద్ర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గత వారం నుంయి ఉల్లి ధరలు స్వల్పంగా పెరుగుతున్నాయి. బుధవారం మార్కెట్‌కు 40 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి రాగా, వ్యాపారస్థులు నిర్వహించిన వేలంలో క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.5,100 పలకగా, కనిష్ఠంగా ధర రూ.3,020 పలికినట్లు మార్కెట్ సెక్రటరి జయశ్రీ తెలిపారు. మార్కెట్‌కు వచ్చిన ఉల్లిలో తెల్లగా నాణ్యంగా ఉన్న వాటికి కొంత వరకు డిమాండ్ ఉండగా, ఎర్ర ఉల్లిని కొనే వారే కరువయ్యారు. కాగా గత వారంతో పోలిస్తే ఈ వారం ఉల్లి ధర క్వింటాలుకు రూ.350 పెరిగింది.

చిన్నరాజమూర్ హుండీ లెక్కింపు

దేవరకద్ర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న రాజమూర్ ఆంజనేయ స్వామి హుండీ బుధవారం లెక్కించగా రూ.4,17,410 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ రాఘవేంద్రాచారి, ఈవో ప్రసాద్ తెలిపారు. ఆగస్టు నుంచి నవంబరు వరకు భక్తులు స్వామి వారికి సమర్పించిన మొక్కులు లెక్కించినట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, ఆలయ పూజారి అన్వేషాచారి, గ్రామస్థులు ప్రేమ్‌కుమార్, కోన రాజశేఖర్, రాజేందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గణిత పోటీలకు సాయిచరణ్

నవాబ్‌పేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన ఇంగ్లిష్ మీడియం గణితం టాలెంట్ టెస్టులో మండలంలోని కొల్లూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి సాయిచరణ్ జిల్లా స్థాయిలో మూడవ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అభినందించారు.

రెండు డీసీఎంలు ఢీ

- ఇద్దరికి గాయాలు

జడ్చర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి జడ్చర్ల న్యూ బస్టాండు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి రెండు డీసీఎంలు ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ఇరువురు డ్రైవర్లకు గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న డీసీఎంను వెనక నుంచి వచ్చిన మరో డీసీఎం ఢీ కొట్టింది. డీసీఎం క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను, స్థానికులు బయటికి తీశారు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాలేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

దేవరకద్ర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్డీవో నర్సిములు, అడిషనల్ డీఆర్డీవో ముషాదాబేగం అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రావు అధ్యక్షతన 2023-24 సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక రెండో బుధవారం కొనసాగింది. ప్రజావేదిక సామాజిక తనిఖీ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మండలంలోని 31 గ్రామాల్లో రూ.4.58 కోట్లకు సంబంధించి ఉపాధి పనులు నిర్వహించగా, రూ.2.49 లక్షలు రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఏపీడీ శ్రీపాల్, డీఈవో ప్రేమలత, ఏపీవో వెంకటేష్ పాల్గొన్నారు.

ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



కొత్తమొల్గరలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

భూత్పూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేయాలని సర్వే అధికారులను కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం మండలంలోని కొత్త మొల్గర గ్రామంలో అధికారులు నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించి, ఇళ్ల కోసం దరఖాస్తున్న చేసుకున్న దరఖాస్తు దారులతో వివరాలు తెలుసుకున్నారు. అదే విధంగా సర్వే అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో జాగ్రత్తలు పాటించాలని, ఏదైన అనుమానం వస్తే తోటి అధికారులు లేదా తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో ఇతర అధికారులను అడిగి తెలుసుకొని అర్హులనే ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. గృహ నిర్మాణ శాఖ పీడీ వైద్యం భాస్కర్, ఎంపీవో శ్రీదేవి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

జడ్చర్ల : జడ్చర్ల మునిసిపాలిటీలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బుధవారం మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత పరిశీలించారు. మునిసిపాలిటీలోని మూడవ వార్డులో కౌన్సిలర్ సతీష్‌తో కలిసి సర్వేను పరిశీలించారు. నిజమైన అర్హులనే గుర్తించాలని సర్వే సిబ్బందికి సూచించారు. అలాగే మునిసిపాలిటీలోని 25వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. 24వ వార్డులో ట్రైబల్ వెల్ఫేర్ మహిళల వసతి గృహం నుంచి వస్తున్న మురుగునీటిని రోడ్డుపై నిల్వకుండా పైపులైన్ ఏర్పాటు చేసే అంశంపై కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ రఘురాంగౌడ్, సిబ్బంది ప్రవీణ్ పాల్గొన్నారు.

● హన్వాడ : ప్రభుత్వం కొత్తగా ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారుల ఎంపికకు చేపట్టిన సర్వేను బుధవారం మండలంలో కార్యదర్శులు ప్రారంభించారు. ప్రజాపాలన అభయహస్తం దర ఖాస్తు ద్వారా గతంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం చేసుకున్న 5,130 దరఖాస్తులను పరిశీలిస్తున్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే సీఎం కప్ టోర్నమెంట్



జడ్చర్లలో సీఎం కప్ కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న డీఈవో



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న అధికారులు

జడ్చర్ల, డిసెంబురు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే సీఎం కప్-2024 టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు డీఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్ ఆవరణలో బుధవారం సీఎం కప్-2024 టోర్నమెంట్‌ను జడ్పీ సీఈవో వెంకటరెడ్డితో కలిసి ప్రారంభించారు. జడ్చర్ల మునిసిపాలిటీతో పాటు మండలంలోని 45 గ్రామ పంచాయతీల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంఈవో మంజులాదేవి పాల్గొన్నారు.

హన్వాడ : సీఎం కప్ మండల స్థాయి ఖోఖో పోటీలు బుధవారం మండల కేంద్రంలో నిర్వహించగా, వేపూర్ విన్నర్‌గా, గొండ్యాల పాఠశాల క్రీడాకారులు రన్నర్‌గా నిలిచారు. తహసీల్దార్ కిష్ట్యానాయక్ విన్నర్ జట్టుకు బహుమతి అందించారు. గురువారం వాలీబాల్ పోటీలు జరుగనున్నట్లు ఎంఈవో గోపాల్‌నాయక్ తెలిపారు.

● కోయిలకొండ: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండోరోజు బుధవారం సీఎం కప్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వీరు జిల్లా పోటీల్లో పాల్గొంటారని తహసీల్దార్ రాజాగణేష్ తెలిపారు. ఎంపీడీవో కాళప్ప, ఎంఈవో వెంకట్‌జీ, సూపరింటెండెంట్ హరీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

● మూసాపేట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ముగియగా, ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తహసీల్దార్ రాజు, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి, ఏంపీవో అనురాధ, పంచాయతీ కార్యదర్శులు మహేందర్, సురేష్, రాఘవేందర్, పీఈటీ సుగుణ పాల్గొన్నారు.

● చిన్నచింతకుంట : మండలంలోని లాల్‌కోటలో సీఎం కప్ మండల స్థాయి పోటీలు ముగియగా, విజేతలకు అధికారులు బహుమతు లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈవో మురళీకృష్ణ, ఎస్ఐ శేఖర్, బత్తుల బాలరాజు, పీఈటీలు రాఘవేందర్, ప్రసన్న, మమత పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత పాటించాలి



కస్తూర్బా గాంధీ పాఠశాలలో అన్నంను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చిన్నచింతకుంట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత పాటించాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహలతో పాటు కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడ బియ్యం, అన్నం ఏ విధంగా ఉందని పరిశీలించారు. ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు వసతి గృహాలను పర్యవేక్షించాలన్నారు. తహసీల్దార్ ఎల్లప్ప, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈవో మురళీకృష్ణ, ఎంపీవో అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● హన్వాడ : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో బుధవారం కాంగ్రెస్ నాయకులు భోజనాన్ని పరిశీలించి, నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు లింగంనాయక్, వెంకటయ్య, కృష్ణయ్య, రామకృష్ణ, మోహన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి



కృష్ణయ్య గౌడ్

జడ్చర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగాపురం నుంచి కోడ్గల్ దారిలో నిర్మాణంలో ఉన్న కల్వర్టు వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో లింగంపేట మాజీ సర్పంచ్ కృష్ణయ్యగౌడ్ (45) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. కృష్ణయ్యగౌడ్ ద్విచక్రవాహనంపై జడ్చర్ల నుంచి లింగంపేటకు వస్తుండగా కల్వర్టు వద్ద ప్రమాదవశాత్తు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కల్వర్టు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టరు సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందంటూ లింగంపేట, కోడ్గల్ గ్రామాల ప్రజలు ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి జడ్చర్ల పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. అదే ప్రాంతంలో ఓ గంట ముందు జరిగిన మరో ప్రమాదంలో జడ్చర్ల పట్టణం ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి సైతం గాయపడ్డాడని స్థానికులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి..



రాజు (ఫైల్)

నవాబ్‌పేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సొంత గ్రామానికి నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మృతి చెందిన సంఘటన మండల కేంద్రం సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మండలంలోని పోమాల గ్రామానికి చెందిన మందుల రాజు (39) బుధవారం సాయంత్రం నవాబ్‌పేటలో పనులు ముగించుకుని తిరిగి నడుచుకుంటూ గ్రామానికి వెళ్తున్నాడు. నవాబ్‌పేట సమీపంలోని చింతల్ కుంట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్లే కొంత మంది పాదాచారులు గుర్తుపట్టి తల్లి రాములమ్మకు సమాచారం ఇవ్వడంతో ఆసుపత్రికి తరలించేందుకు యత్నించగా అప్పటికే మృతి చెంది నట్లు గుర్తించి, పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా ఆసుత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పత్తి క్వింటాలుకు గరిష్ఠ ధర రూ.6,759

జడ్చర్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాదేపల్లి మార్కెట్‌కు బుధవారం 176 మంది రైతులు, 2,206 క్వింటాళ్ల వివిధ రకాల ధాన్యాలను విక్రయానికి తీసుకొచ్చారు. వాటిలో పత్తి క్వింటాలుకు గరిష్ఠంగా రూ.6,759, కనిష్ఠంగా రూ.5001 రాగా, మాడల్ ధరగా రూ.6,549 వచ్చింది. మొక్కజొన్న క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,427, కనిష్ఠంగా రూ.2,303, ఆర్ఎన్ఆర్ వరి క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,836, కనిష్ఠంగా రూ.2,149, మాడల్ ధరగా రూ.2,621 పలికింది. హంస క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,239, కనిష్ఠంగా రూ.2,219, మాడల్ ధరగా రూ.2,221, వేరుశనగ క్వింటాలుకు గరిష్ఠంగా రూ.6,280, కనిష్ఠంగా రూ.4,221, మాడల్ ధరగా రూ.5,169 పలికింది.

మహాసభను విజయవంతం చేయాలి

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 17న పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించే మాదిగ విద్యార్థి మహా సభను విజయవంతం చేయాలని పీయూ ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మీసాల గణేష్ తెలిపారు. బుధవారం పీయూ రిజిస్ట్రార్‌తో మహాసభ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సభకు అనుమతిని కోరుతూ.. మహా సభకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని తెలిపారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్షలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె రెండో రోజు బుధవారం కొనసాగింది. ఈ సమ్మెకు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయుల మద్దతు తెలిపారు. తెలంగాణ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, టీటీయూ జిల్లా అధ్యక్షుడు జుర్రు నారాయణ, రూప్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యాదగిరి, నాయకులు మొగులయ్య పాల్గొన్నారు.

మోహన్‌బాబును అరెస్టు చేయాలి

టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షుడు దండు దత్తేంద్ర



మహబూబ్‌నగర్‌లో నిరసన చేపట్టిన జర్నలిస్టులు

పాలమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబును అరెస్టు చేయాలని ఐజేయూ టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు దండు దత్తేంద్ర డిమాండ్ చేశారు. మోహన్‌బాబు ఇంటి దగ్గర జరుగుతున్న గందరగోళ ఘటనలను కవరేజ్ చేసేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులను తన బౌన్సర్లతో దాడి చేయించి, తాను దాడిచేసి గాయపరిచిన అతనిపై పోలీసులు కేసు నమోదు చేయాలన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో జర్నలిస్టులపై జరిగిన దాడికి నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్పీ జానకికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు శివకుమార్, ఎన్.రవీందర్‌రెడ్డి, కిషోర్‌గౌడ్, ప్రసాద్, అబి, వరప్రసాద్, వెంకటయ్య, నరేష్, చంద్రశేఖర్‌గౌడ్, రామకొండ, రవికుమార్ పాల్గొన్నారు.


● జడ్చర్ల : జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్‌బాబు దాడికి పాల్పడిన సంఘటనపై బుధవారం జడ్చర్ల అంబేడ్కర్ చౌరస్తా వద్ద టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఆదిరెడ్డికి వినతి పత్రం అందజేశారు.

● బాలానగర్ : జర్నలిస్టులపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని బాలాగనర్ మండల జర్నలిస్టు యూనియన్ అధ్యక్షుడు లక్ష్మన్‌నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ తిరుపాజికి మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలని చేశారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

రేపటి నుంచి 17 వరకు చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఉత్సవాలు





చిన్నరాజమూర్ ఆలయం, ఆంజనేయస్వామి మూల విరాట్

దేవరకద్ర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొలచిన వారికి కొంగు బంగారం చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాది ఈనెల 13 నుంచి 17 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ రాఘవేంద్రచారి బుధవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 13న ధ్వజారోహణం, పంచామృతాభిషేకం, అలంకరణ, హనుమత్‌వ్రతం, పవమాన హోమం, సాయంత్రం శ్రీనివాస కల్యాణం, రాత్రికి హంసవాహన సేవ, 14న పంచామృతా అభిషేకం, అలంకరణ, రాత్రికి అశ్వవాహన సేవ, ప్రభోత్సవం నిర్వహించనున్నారు. 15న పంచామృతా అభిషేకం, మహా అలంకరణ, రాత్రికి గజవాహన సేవ, రథోత్సవం, 16న పంచామృతా అభిషేకం, అలంకరణ, పల్లకీ సేవ, 17న పల్లకీ సేవతో కార్యక్రమాలు ముగుస్తాయని ఆలయ చైర్మన్ తెలిపారు. జిల్లా నలమూలల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఆఫీస్ బేరర్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. 2023 జూలై నుంచి పీఆర్సీ అమలు చేయాల్సి ఉన్నా.. ఇందుకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. సమగ్రశిక్షలో పని చేసే కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. జీవో 317 లోపాలను సవరించి స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ ఈనెల 14 నుంచి జడ్చర్ల పట్టణంలో జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, నర్సింహులు, నాయకులు కిష్యానాయక్, రాములు, కృష్ణయ్య, వెంకటయ్య, కనకమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



సైన్స్ ఫేర్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడుతాయని డీఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఫాతిమా విద్యాలయంలో గురువారం నుంచి నిర్వహించే జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఇందులో ప్రభుత్వ, జిల్లా పరిషత్, ప్రైవేట్, గురుకుల పాఠశాల నుంచి విద్యార్థులు సైన్స్‌గైడ్ టీచర్ సహకారంతో రూపొందించిన ప్రదర్శనలు ప్రదర్శిస్తారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు సైన్స్ ఫెయిర్ ప్రారంభం కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ సూపరింటెండెంట్ శంభుప్రసాద్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభ పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మూసాపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిజాలాపూర్ గ్రామంలో దాతల సహకారంతో కురుమూర్తి స్వామి గండ దీపం ధ్వజస్థాపన ప్రతిష్ఠాపనకు బుధవారం చేపట్టగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్ నాయకులు శివరాములు, మద్దిగట్ల నారాయణ, బత్తుల శ్రీనివాసులు, చెన్నయ్య, బాబు, చందు, శ్రీను, మన్నెంకొండ, నాగన్న, సతీష్, సాయిలు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి



గీతా పారాయణం చేస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గీతా జయంతి మహోత్సవం పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని కొత్త గంజ్ లక్ష్మీ నరసింహ్మా స్వామి ఆలయంలో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, గీతా శ్లోకాల పారాయణం నిర్వహించారు.

● మూసాపేట : మండలంలోని జానంపేట గ్రామంలో గీతా జయంతి సందర్భంగా గ్రామానికి చెందిన మాలేల శశిధర్‌గౌడ్ ఆధ్వర్యంలో భవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామంలోని శివాలయానికి టెంపుల్ బెల్ పరికరాన్ని బహూకరించారు.

● జడ్చర్ల : పట్టణంలోని సరస్వతి శిశు మందిరంలో గీతా జయంతిని ఘనంగా నిర్వహిం చారు. పాఠశాలలోని విద్యార్థు లంతా అష్టాదశ శ్లోక పఠనం చేశారు. పాఠశాల ప్రబంధకారిణి పద్మలీల, కనకప్ప, కృష్ణమూర్తి, రాధాకృష్ణ, ప్రధా నాచార్యులు వెంకటయ్య, ఆచార్య బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● నవాబ్‌పేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వివిధ పాఠశాలలకు చెందిన 320 విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. జంగమయ్యపల్లికి చెందిన గణేష్ 47 శ్లోకాలు పూర్తిస్థాయిలో చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరాములు, ఎంఈవో నాగ్యానాయక్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు యాదయ్య, రాధాకృష్ణ, లక్ష్మీ సాయి తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామాన్ని ఎస్సీకి కేటాయించాలి



భూత్పూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దీక్ష చేపట్టిన నాయకులు

భూత్పూర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వెల్కిచర్ల గ్రామాన్ని ఎస్సీకి కేటాయించాలని కోరుతూ బుధవారం భూత్పూర్ చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షా కార్యక్రమానికి దళిత సంఘం జిల్లా నాయ కులు బాలయ్య, శ్రీరాములు, రాంచందర్ పాల్గొ ని మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అవుతున్నా మండలంలోని వెల్కిచర్ల గ్రామాన్ని ఇంత వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ రిజ ర్వేషన్ కేటాయించకపోవడం దారుణం అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా దళితుల బతుకులు మారడం లేదని ఆరోపించారు. కొన్ని నెలలుగా మా గ్రామాన్ని దళితులకు రిజర్వేషన్ చేయాలని అధికారులను వేడుకున్నా పట్టించుకునే నాథుడే కరువు అయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి వెల్కిచర్ల గ్రామాన్ని ఎస్సీ రిజర్వేషన్‌గా ప్రకటించాలని కోరారు. వెల్కిచర్ల గ్రామ దళితులు, నాయకులు పాల్గొన్నారు.